క్లుప్తంగా

చెంచు గిరిజనులకు జాబ్‌కార్డులు



మాట్లాడుతున్న ఐటీడీఏ రవీంద్రారెడ్డి

ఆత్మకూరు: మండలంలోని అన్ని చెంచుగూడేల్లోని గిరిజనులు ఉపాధి పనులకు వెళ్లేలా జాబ్‌కార్డులు మంజూరు చేస్తామని ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి, పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో చెంచుగిరిజనులకు జాబ్‌కార్డులు, ఉపాధి పనులపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డులో నలుగురి కంటే ఎక్కువగా ఉంటే అందులో అందరికీ కూలీ పని కల్పించడమే కాకుండా, వివాహం కాని చెంచు గిరిజనులకు కొత్త జాబ్‌కార్డు కూడా మంజూరు చేస్తామన్నారు. అనంతరం గూడేల్లోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఏపీడీ అన్వరాబేగం, కోవెలకుంట్ల ఏపీడీ సాంబ శివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ధర్మకర్తలు కృషి చేయాలి



ప్రారంభ పూజలు నిర్వహిస్తున్న ప్రముఖులు

మహానంది: ఆలయాల అభివృద్ధికి ధర్మకర్తల మండలి సభ్యులు కృషి చేయాలని రాష్ట్ర దేవాలయాల పరిపాలనా సంస్థ (ఎస్‌ఐటీఏ) డైరెక్టర్ డి.రామచంద్రరావు, దేవదాయశాఖ సలహాదారులు జ్వాలా శ్రీకాంత్ తెలిపారు. మహానందిలోని పోచా బ్రహ్మానందరెడ్డి డార్మెటరీ భవనంలో గురువారం ఉమ్మడి జిల్లాల్లోని ఆలయాల ధర్మకర్తలకు మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధిలో ధర్మకర్తల పాత్ర ఎంతో కీలకమన్నారు. సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు.

కొట్టాలచెర్వులో ఉచిత ఎక్స్‌రే శిబిరం

ఆత్మకూరు: మండలంలోని కొట్టాలచెర్వు చెంచుగూడెం పీహెచ్‌సీలో గురువారం ఉచిత ఎక్స్‌రే క్యాంప్ నిర్వహించారు. సర్పంచ్ నాగలక్ష్మి శిబిరాన్ని ప్రారంభించారు. సేవా భారతి జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి, టీబీ సూపర్‌వైజర్ మస్తానయ్య మాట్లాడుతూ గ్రామంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా టీబీ రోగుల కోసం ఉచిత ఎక్స్‌రే శిబిరాన్ని నిర్వహించామని చెప్పారు. దాదాపు వంద మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.కార్యక్రమంలో వైద్య సిబ్బంది రవికుమార్, సౌజన్య,సత్యం,మాలిక్,రత్నమ్మ పాల్గొన్నారు.

చదువుపై నిర్లక్ష్యం వద్దు

ఆత్మకూరు: విద్యార్థులు చదువు పట్ల నిర్లక్ష్యం వహించొద్దని ఎంఈఓ జానకీరాం అన్నారు. పట్టణంలో గురువారం ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని, బడి మాని వేసిన విద్యార్థులను పాఠశాలలకు రప్పించాలని, చదువు పట్ల అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ రఘురాం రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామానుజాచార్యులు, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నయీం తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు కేసీ నీరు



తూము ఎత్తుతున్న రైతులు, అధికారులు

జూపాడుబంగ్లా: కర్నూలు–కడప కాల్వకు సాగునీరు విడుదల చేయటంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాటిపాడు గ్రామానికి చెందిన రైతులు గ్రామ సమీపంలో ఉన్న కేసీ కాల్వ తూముకు గురువారం పూజలు నిర్వహించి అధికారుల సహకారంతో తూమును ఎత్తారు. కాల్వల్లోంచి సాగునీరు పంటపొలాల్లోకి పరుగులు తీయటంతో రైతులు పొలాలకు సాగునీటిని పారించుకొనేందుకు పొలాలకు వెళ్లారు. కార్యక్రమంలో కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్, గ్రామ రైతులు జక్కిరెడ్డిగారి శంకర్‌రెడ్డి, కోసిక తరుణ్ కుమార్‌రెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య సమావేశం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండల మహిళా సమాఖ్య సమావేశాన్ని గురువారం సున్నిపెంటలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించారు. గ్రామైక్య సంఘాలు, ఏబీ, వీఓఎలతో మండల సమాఖ్య కోశాధికారి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. గ్రామసంఘాల నుంచి రూ.210 సభ్యత్వ రుసు, రూ.1000 లు షేక్యాపిటల్‌గా కట్టించుకున్నారు. ఆగిపోయిన సీఐఎఫ్‌ను తిరిగి గ్రామ సంఘాలతో వంద కంతుల లోగా కట్టడానికి గ్రామైక్య సంఘాలు తీర్మానించాయి. ఆగిపోయిన స్త్రీనిధి, ఉన్నతి నూరు శాతం రికవరీ చేపట్టాలని డీఆర్‌డీఏ ఏపీయం శివ ఆదేశించారు.

శ్మశానాన్నీ వదలట్లేదు!

- కబ్జాకు గురవుతున్న స్థలం
- 1.82 ఎకరాల స్థలంలో మిగిలింది 90 సెంట్లే
- పట్టించుకునే వారే కరువు
- ఆందోళనలో తుమ్మలూరు గ్రామస్తులు



ఆక్రమణకు గురవుతున్న శ్మశానవాటిక



శ్మశానవాటిక స్థలంలో తవ్విన పంట కాల్వ

పాములపాడు: ధనిక, పేద తారతమ్యాలు లేకుండా ఉండే ప్రదేశం శ్మశానవాటిక. ఇక్కడ ఎవరినైనా ఆరడుగుల నేలలోనే పూడ్చడం జరగుతుంది. ప్రతి మానవుడికి శాశ్వత నివాసం ఇదే. అయితే దీనిని కూడా ఆక్రమించుకొని అనుభవించేందుకు కొందరు ప్రయత్నం చేయడం దారుణం. మండలంలోని తుమ్మలూరు గ్రామంలో ఈ తతంగం జరుగుతోంది.

1.81 ఎకరాల్లో శ్మశానవాటిక

మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామం 1981వ సంవత్సరంలో శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో ముంపునకు గురైంది. ఆ సమయంలో పునరావాస గ్రామాన్ని నిర్మించుకునేందుకు అప్పటి గ్రామ పెద్దలు జూటూరు గ్రామ పొలిమేరలోని సర్వే నెంబరు 494లో దాదాపు 11 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. అయితే ఎస్‌ఆర్‌ఎంసీ కాల్వకు దగ్గరగా ఈ పొలం ఉండటంతో మళ్లీ ఏదైనా నీటి నుంచి ప్రమాదం సంభవించవచ్చునని భావించి మరో కిలో మీటరు దూరంలో గ్రామాన్ని నిర్మించుకున్నారు. ఈ క్రమంలో గ్రామానికి హిందూ శ్మశాన వాటికకు స్థలం కరువైంది. దీంతో 494 సర్వేనెంబరులో ఉన్న పొలంలో 494/2 సబ్ డివిజన్ చేసి 1.81 ఎకరాల పొలాన్ని హిందూ శ్మశానవాటికకు కేటాయించారు. మిగతా పొలాన్ని రైతులకు విక్రయించారు. తద్వారా వచ్చిన సొమ్మును గ్రామానికి వినియోగించినట్లు గ్రామస్తులు తెలిపారు.

కొద్దికొద్దిగా జరుగుతూ..

గ్రామంలో దాదాపు హిందువుల కుటుంబాలు 400లకుపైగా ఉన్నాయి. ప్రస్తుతం శ్మశానవాటికను చుట్టు పక్కల ఉన్న రైతులు పొలాన్ని ప్రతి సంవత్సరం కొంత మేర జరుగుతూ 1.82 ఎకరాల పొలాన్ని కేవలం 90 సెంట్లకు పరిమితం చేశారు. ఒక రైతు ఏకంగా శ్మశాన వాటికలోనే పంట కాల్వ తీయించాడని ప్రజలు వాపోతున్నారు. ఇదేమిటని అడిగితే నా పొలంలో నేను కాల్వ తవ్వాను అడిగేదెవరు అన్నట్లు మాట్లాడుతున్నడని రైతులు చెబుతున్నారు. ఆక్రమణ విషయంపై పలు మార్లు అధికారులకు ఈ విషయం చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గ్రామానికి సంబంధించిన హిందూ శ్మశానవాటిక స్థలాన్ని కబ్జాకు గురికాకుండా స్థలాన్ని కాపాడి, ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



శ్మశాన వాటిక కబ్జా పై అధికారులు చొరవ తీసుకోవాలి. చుట్టు పక్కల వారు అక్రమంగా చొరబడుతున్నారు. కొలతలకు సహకరించడం లేదు. కొలతలు వేసే సమయంలో సమాచారం అందించినా రావడం లేదు. వారి వద్ద ఉన్న ఆధారాలు కూడా తీసుకురావడం లేదు.

– వెంకటేశ్వరరెడ్డి, తుమ్మలూరు

ప్రతి సంవత్సరం అర్జీలు ఇస్తున్నాం



గత ప్రభుత్వంలో జరిగిన మీ ఇంటికి– మీ భూమి కార్యక్రమం సందర్భంగా గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చాం. అంతకు ముందు జిల్లా అధికారులకు కూడా అర్జీలు ఇచ్చాం. పట్టించుకునే వారే కరువయ్యారు. అధికారులు స్పందిస్తేనే సమస్య పరిష్కారమవుతుంది.

–శేఖర్, తుమ్మలూరు

శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలి



శ్మశానవాటిక స్థలాన్ని కొలిచి సరిహద్దులు ఏర్పాటు చేయాలి. అంతే కాకుండా చుట్టూ ప్రహరీగోడ నిర్మాణం చేపట్టాలి. ఇది గ్రామస్తులందరి ఆస్తి. కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉంది. అధికారులు సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి.

–వరప్రసాద్, సర్పంచు తుమ్మలూరు

సరైన ఆధారాలు తీసుకురాలేదు



ఆ స్థలం శ్మశాన వాటికదని, 1.82 ఎకరాలున్నట్లు సరైన ఆధారాలు తీసుకువస్తే పరిశీలిస్తాం. ఇప్పటి వరకు రెండు సార్లు కొలతలు వేయించాం. ప్రస్తుతం భూమి 90 సెంట్లు ఉంది. గ్రామస్తులు 1.82 ఎకరాలుందని చెబుతున్నారు. అందుకు సంబంధించిన ఆధారాలతో వస్తే తప్పని సరిగా చర్యలు తీసుకుంటాం.

–రత్నరాధిక, తహసీల్దార్

చెన్నైకి రైలు ఏర్పాటు చేయండి



డీఆర్‌ఎంకు జ్ఞాపిక అందిస్తున్న ఈఓ, పండితులు

మహానంది: మహానందీశ్వరస్వామి దర్శనార్థం తమిళనాడు రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారని, వారి సౌకర్యార్థం చెన్నైకి రైలు సరీ్వసు ఏర్పాటు చేయాలని మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధానిలు డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్‌కు విజ్ఞప్తి చేశారు. మహానందీశ్వరుడి దర్శనార్థం గురువారం మనీష్ అగర్వాల్ మహానందికి వచ్చారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకన్న అనంతరం వారికి స్థానిక అలంకార మండపంలో ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. వారు మాట్లాడుతూ నంద్యాల నుంచి తిరుపతికి మరో రైలు ఏర్పాటు చేస్తే భక్తులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. అందుకు డీఆర్‌ఎం సానుకూలంగా స్పందించారు.

రోడ్డుప్రమాదంలో వ్యకికి గాయాలు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని అయ్యవారికోడూరు–కొత్తపల్లి మార్గంలో గురువారం రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. ఈర్నపాడు గ్రామానికి చెందిన మహమ్మద్ ఇంటికి వెళ్తుండగా బైక్ టైరు పంక్చర్ కావడంతో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో మహమ్మద్ కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలోని స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం ఆటోలో నంద్యాల ఆస్పత్రికి తరలించారు.

దత్తాత్రేయస్వామికి పూజలు



భజన ప్రారంభ పూజల్లో పాల్గొన్న ఈఓ లవన్న

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం ఆధ్వర్యంలో గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను ఈఓ లవన్న, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

శ్రీశైలంలో శివచతుస్సప్తాహ భజనలు

పవిత్రశ్రావణమాసంలో శివనామస్మరణ అత్యంత శ్రేష్టమైనది. లోకకల్యాణం కోసం ప్రతి సంవత్సరం శ్రావణమాసం శ్రీశైలదేవస్థానం శివచతుస్సప్తాహ భజనలు నిర్వహిస్తోంది. గురువారం ఈ భజనలను అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రారంభించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ, స్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా విశేషపూజలు జరిపించారు. అనంతరం పంచాక్షరీ నామ భజన ప్రారంభించారు. ఆలయప్రాంగణంలోని వీరశిరో మండపంలో సెప్టెంబర్ 15వ తేదీ వరకు రేయింబవళ్లు ఈ భజనలు కొనసాగుతాయి. కర్నూలు నగరానికి చెందిన 5 భజన బృందాలకు, కర్ణాటకకు చెందిన రెండు భజన బృందాలకు శ్రావణమాసంలో శివభజనలు చేయడానికి దేవస్థానం అవకావం కల్పించింది. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన ఈఓ ఎస్ లవన్న పాల్గొన్నారు.

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఆత్మకూరు/కొత్తపల్లి: మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు ప్రభాకర్ రెడ్డి, మంజునాథ్, నరసింహ, ఆత్మకూరు ఏడీఏ అంజనేయులు అన్నారు. మండలంలోని బాపనంతపురం, నల్లకాల్వ, కరివేన, శ్రీపతిరావు పేట, కొత్తపల్లి మండలంలోని నందికుంట, బావాపురం గ్రామాల్లో మొక్కజొన్న పంటను గురువారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న వర్షాభావ పరిస్థితుల వలన ఇబ్బందులు ఏర్పడ్డాయని చెప్పారు. దిగుబడి గణనీయంగా తగ్గే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇందుకు రైతులు నీటిలో కరిగే ఎరువులు మల్టీ–కే 19:19:19ను పదిగ్రాముల చొప్పున నీటిలో కలిపి వారంలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. పొలాల్లో జింక్, లూజీమచ్చ తెగులు అధికంగా ఉన్నాయని ఇందుకు 50 కేజీల యూరియను వేయాలన్నారు. నేలలో తగినంత తేమ శాతం ఉన్నప్పుడు 50 కేజీల యూరియా, 20 కేజీల పొటాష్ అందిచాలని సూచించారు. ఇతర వివరాలకు సమీపంలోని వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, మహేష్, జిల్లా వనరుల కేంద్రం, వ్యవసాయాధికారి హేమలత, సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నందికొట్కూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు భాస్కరరెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమా న పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. గోపాల్, పక్కీర్ సాహె బ్, నాగన్న, భాస్కర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వామిరెడ్డి ఆశయాల సాధనకు ఉద్యమించాలి



స్వామిరెడ్డి చిత్ర పటం వద్ద జోహార్లు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

నందికొట్కూరు: అణగారిన వర్గాలు, పీడిత ప్రజల కోసం నిరంతరం పోరాటాలు చేసిన యాలూరి స్వామిరెడ్డి ఆశయాల సాధన కోసం ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రఘురామమూర్తి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో కమ్యూనిస్టు స్వామిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయ న చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ యాలూరి స్వామిరెడ్డి స్వాతంత్ర్య సమరయోధుడని, తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా సీపీఐ ప్రధాన కార్యదర్శిగా పని చేశారని, పగిడ్యాల మండలం బీరవోలు గ్రామంలో న్యాయవాది, వ్యవసాయ కుటుంబంలో జన్మించారని తెలిపారు.కొండప్రాగటూరు ఊరి నిర్మాణం కోసం తన సొంత భూమి ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనివాసులు, నాగేంద్రప్రసాద్,షేక్షావలి, మాదన్, లాలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని ఆపలేరు

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- బోయరేవుల, అయ్యవారిపల్లెలో 'గడప గడపకు మన ప్రభుత్వం'
- శిల్పాకు ఘన స్వాగతం



బోయరేవుల గ్రామంలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

వెలుగోడు: చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇద్దరూ ఏకమైనా వచ్చినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనాన్ని ఆపలేరని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ప్రజా మద్దతుతో రాష్ట్రంలోని 175 స్థానాల్లోనూ విజయం సాధించడం తథ్యమన్నారు.గురువారం మండలంలోని బోయరేవుల, అయ్యవారిపల్లె గ్రామాల్లో 119వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు వైఎస్సార్‌సీపీ నాయకులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం అదించిన సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

సమస్యల పరిష్కారానికి ఆదేశం

బోయరేవుల గ్రామంలో విద్యుత్ స్తంభాలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని కోరడంతో వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఎమ్మెల్యే శిల్పా ఆదేశించారు. అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ఆర్థికసాయం చేశారు. బోయరేవుల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారులతో ముచ్చటించారు.

జగన్ జైత్రయాత్రను ఆపే శక్తి ఎవరికీ లేదు..

ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ..ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జైత్రయాత్రను ఆపే శక్తి ఎవరికీ లేదన్నారు. ఏ సర్వేలు చూసినా వైఎస్ జగన్‌కే పట్టం కడుతున్నాయని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేనలు తుడిచిపెట్టుకుపోవడం ఖాయమన్నారు. గతంలో చంద్రబాబును నమ్మి ప్రజలు మోసపోయారని, మరోసారి మోసపోయే పరిస్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ముంతల విజయభాస్కర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ రమణ, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోగోలు శివశంకర్‌నాయుడు, అయ్యవారిపల్లె వైఎస్సార్‌సీపీ నాయకులు రొద్ద శేఖర్, రొద్ద నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉప ఎన్నికల ప్రచారం

- చివరిరోజు పోటాపోటీగా ప్రచారం
- రేపు పోలింగ్
- ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం



నాగటూరులో ఎన్నికలప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

పగిడ్యాల: స్థానిక 9వ వార్డు మెంబర్ ఉప ఎన్నికకు పోటీ నెలకొనడం వలన అభ్యర్థులు ఈనెల 16 నుంచి చేపట్టిన ప్రచారం గురువారంతో ముగిసింది. పోలింగ్‌కు 24 గంటలు ముందస్తుగా ప్రచారం నిలిపివేయాలన్న ఎన్నికల కోడ్ ఉందన్నారు. అభ్యర్థులు ప్రచారం కొనసాగిస్తే ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి(స్టేజ్–2) ఎంఈఓ సుభాన్ హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిన, భయపెట్టడం, బెదిరించడం చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

నాగటూరులో పోటాపోటీగా..

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని నాగటూరు గ్రామంలోని 8వ వార్డు సభ్యుడి ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల ప్రచారంలో ఇద్దరు అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గురువారం చివరిరోజు కావడంతో మహిళా అభ్యర్థి చెరుకు రత్నమ్మ ఇంటింటి ప్రచారం నిర్వహించి తనకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు పబ్బతి రవి, వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికకు పకడ్బందీగా ఏర్పాట్లు

మిడుతూరు: మండలంలోని వార్డు ఉప ఎన్నికకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వార్డులకు ఉప ఎన్నిక జరగనున్న అలగనూరు, పైపాలెం పోలింగ్ స్టేషన్లలో ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. 19న అలగనూరు, పైపాలెం గ్రామాల్లోని పోలింగ్ జరగనున్న రెండు వార్డులకు ఆర్ఓ, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఎన్నిక సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఏర్పాట్లను చేశామన్నారు. ఓటింగ్ సమయంలో వార్డు ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరగేందుకు అందరూ సహకరించాలని కోరారు.

విద్యుత్ కనెక్షన్లను పరిశీలించండి

కొత్తపల్లి: లబ్ధిదారులు నిర్మించుకుంటున్న నూతన గృహాలకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయాలేదా అని పరిశీలించాలని ఎంపీడీఓ మేరి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో జగనన్న కాలనీలలో, సొంత స్థలాలలో ఇళ్లనిర్మాణాలు చేసుకుంటున్న వారికి విద్యుత్ స్తంభాలు ఉన్నాయా లేదా, పూర్తి అయిన ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు తీసుకున్నారా లేదా తెలుసుకోవాలన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి



దేవాలయాన్ని విలీనం చేసుకుంటున్నట్లు సర్పంచు దంపతులకు పత్రం అందిస్తున్న అధికారులు

పాములపాడు: దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంత గానో కృషి చేస్తున్నారని దేవదాయశాఖ సలహాదారులు జ్వాలా శ్రీకాంత్ తెలిపారు. గురువారం మండలంలోని బానకచెర్ల గ్రామంలో ఏడేళ్ల క్రితం పారిశ్రామిక వేత్త, కోమెసా చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆవుల నారాయణ రెడ్డి రూ.50లక్షలతో శివ, సీతారాముల దేవాలయం నిర్మించారు. ఈ ఆలయం గ్రామస్తుల నిర్వహణలోనే ఉంది. అయితే ప్రస్తుతం దీనిని ప్రభుత్వం దేవదాయశాఖలో విలీనం చేసుకుంటున్నట్లు దేవదాయ ధర్మదాయశాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనర్ సుధాకరరెడ్డి గురువారం గ్రామ సర్పంచ్ ఆవుల జయసుధకు పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ ఇక నుంచి దేవాలయానికి ప్రభుత్వం అందించే రాయితీలు వర్తిసాయన్నారు. ప్రభుత్వంలో దేవాలయాన్ని విలీనం చేయడం కోసం ఎంతో కృషి చేసిన ఆవుల వెంకటనారాయణరెడ్డి, సర్పంచు ఆవుల జయసుధలను సత్కరించారు. అనంతరం వారికి లలితా సంగమేశ్వరుని పటాన్ని గ్రామ సర్పంచ్ అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచు నరసింహగౌడు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రామలింగేశ్వరరెడ్డి, పువ్వాడి భాస్కర్, ఓబన్నగౌడు, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కొత్తపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గువ్వలకుంట్ల, కొత్తపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో డాక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం సిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు ఎత్తు, బరువు, రక్తగ్రూపు నమూనాలు సేకరిస్తున్నారు. రక్తం తక్కువ ఉన్న, పోషకాహారం లోపంతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

రైతు బాగుంటేనే సమాజం సుభిక్షం



వేంపెంట సొసైటీ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న పెద్ద వెంకటస్వామి

పాములపాడు: ప్రతి రైతు బాగుండాలని అప్పుడే సమాజం సుభిక్షంగా ఉంటుందని నూతనంగా సింగిల్ విండో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తెలుగు పెద్ద వెంకటస్వామి అన్నారు. గురువారం మండలంలోని వేంపెంట పరపతి వ్యవసాయ సహకార సొసైటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్, డైరెక్టర్లు గోపాల్, నాగలక్ష్మలతో సీఈఓ సునిల్ ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్ మాట్లాడుతూ రైతులకు నిత్యం అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి, సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన నమ్మకాన్ని వమ్ముచేయకుండా సేవలందిస్తామనని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగరాజు, మద్దూరు సొసైటీ చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి, ఎంపీటీసీ నాగలక్ష్మమ్మ, సర్పంచులు పాములపాడు భాగ్యమ్మ, ఇస్కాల మౌలాలి, చెలిమిల్ల చంద్రారెడ్డి, నాయకులు చౌదయ్య, బంగారం తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నందికొట్కూరు సహకార సొసైటీ చైర్మన్‌గా లక్ష్మీకాంతారెడ్డి ప్రమాణస్వీకారం

నందికొట్కూరు: రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని సహకార సొసైటి చైర్మన్ లక్ష్మీకాంతారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని సహకార సొసైటీ కార్యాలయంలో చైర్మన్ లక్ష్మీకాంతారెడ్డి, డైరెక్టర్లు సవారయ్య, మధులతో సొసైటీ సీఈఓ రబ్బానీ ప్రమాణాస్వీకారం చేయించారు. తమకు పదవీ బాధ్యతుల అప్పగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర శాప్ చైర్మన్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, 80 బన్నూర్ సొసైటీ చైర్మన్ రమణ, బిజినవేముల సర్పంచు రవియాదవ్, ఎంపీటీసీ సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, శ్రీకాంత్, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

ఆత్మకూరు: పట్టణంలోని కోర్టులో సెప్టెంబర్ 9వ తేదీన నిర్వహించనున్న నేషనల్ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి తేజ సాయి కోరారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో గురువారం పోలీసు అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీకా గలిగే క్రిమినల్, సివిల్ కేసులు, మున్సిపల్ ప్రాపర్టీ ట్యాక్స్, బిల్డింగ్ ప్లాన్ తదితర కేసులను పరిష్కరించేందుకు కక్షిదారులతో చర్చించాలని సూచించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాబు రాజేంద్రప్రసాద్, ఎస్ఐ నారాయణరెడ్డి, కొత్తపల్లి ఎస్ఐ హుస్సేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.